సీపీఐ జిల్లా కార్యదర్శికి సత్కారం



జవహర్‌నగర్: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సీపీఐ పార్టీ కార్యదర్శి ఉమామహేష్‌ను గురువారం జవహర్‌నగర్‌కు చెందిన కళాబృందం వ్యవస్థాపకుడు వెంకటాచారి ఆధ్వర్యంలో కలిసి సత్కరించారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉమా మహేష్ మాట్లాడుతూ.. జిల్లాలో సీపీఐ పార్టీ పూర్వవైభవాన్ని తీసుకొచ్చేలా కృషి చేస్తానన్నారు. జంగిడి శ్రీనివాస్, తిరుపతి, బబ్లూచారి, రాములు, హరినాథరావు, సహదేవరెడ్డి, సతీష్, జానకిరామ్ తదితరులున్నారు.

దోస్త్- 2025 రెండోదశ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ షురూ

ఉప్పల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరిక కోసం దోస్త్ -2025 ద్వారా రెండో దశ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డా. విజయ్‌కుమార్ తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ఉత్తీర్ణులైన విద్యార్థులు మే 30 నుంచి జూన్ 8 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. బీఏ, బీకాం, బీఎస్సీ ఎంపీసీ, ఏపీసీఎస్, జీజెడ్సీ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని వెబ్ ఆప్షన్లలో ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. మొదటిదశలో సీటు సాధించిన విద్యార్థులు ఉప్పల్ కూరగాయల మార్కెట్ వద్ద గల కళాశాల కార్యాలయంలో దోస్త్ అడ్మిషన్ల సమన్వయ కర్త జె. విశ్వనాథ్‌ను సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8985927019.

దశాబ్దాలుగా విలువలతో కూడిన విద్యనందిస్తున్నాం

లయోలా అకాడమీపై వస్తున్న ఆరోపణలను ఖండించిన యాజమాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎన్.బి.బాబు

అల్వాల్: లయోలా అకాడమీ పట్ల కొన్ని మీడియాలో వస్తున్న వార్తలను కళాశాల నిర్వాహకులు ఖండించారు. గురువారం అల్వాల్‌లోని లయోలా కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రిన్సిపాల్ ఎన్.బి.బాబు మాట్లాడుతూ.. లయోలా అకాడమీ 4 దశాబ్దాలుగా ఎంతోమంది నైపుణ్యత గల విద్యార్థులను తీర్చిదిద్దిందన్నారు. విద్యతోపాటు వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న సంకల్పంతో ప్రతిఏటా కళాశాల ఆవరణలో నిబద్ధత గల కన్సల్టెన్సీలను పిలిచి, విద్యార్థులకు పరిచయం చేసి వారి అదృష్టం మేరకు ఉద్యోగాలను ఎంచుకోవాల్సిందిగా సూచించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా జరిగిన ప్రక్రియలో 5 మంది విద్యార్థులకు ఇబ్బంది ఏర్పడిందని, తెలిసి వారికి న్యాయం జరిగేలా కృషిచేస్తామన్నారు. కొందరు కావాలని లయోలా అకాడమీ ప్రతిష్టకు భంగం కలిగేలా వ్యవహరించారన్నారు. విద్యార్థులను మోసం చేసిన గ్లోబల్ పయనీర్ కన్సల్టెంట్ సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అల్వాల్ పోలీసులను కోరామన్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా బాధ్యులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ శ్రేణుల సంబురాలు



అల్వాల్‌లో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అల్వాల్: ఢిల్లీలో రాష్ట్రపతి చేతులమీదుగా ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణమాదిగ పద్మశ్రీ అవార్డు అందుకోవడం యావత్ మాదిగ జాతికి దక్కిన గౌరవమని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్‌మాదిగ అన్నారు. గురువారం అల్వాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరతరాలుగా అంటరానితనం, సమాజ ఆదరణకు దూరమైన మాదిగ వర్గం ఇప్పుడిప్పుడే మందకృష్ణ మాదిగ పోరాటం వల్ల గుర్తింపుపొంది హక్కులను సాధించుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో పద్మశ్రీ అవార్డు రావడం మాదిగ వర్గానికి గర్వకారణమన్నారు. ఈనెల 31న పద్మశ్రీ అవార్డుతో వస్తున్న మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలికేందుకు వరంగల్‌కు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకులు సురేష్, రమేష్, బాలపీర్, పరశురాం, మధు, మన్నెం, కురుమయ్య, రాము, మధు, కృష్ణ, ఆనంద్, రాజు, ప్రేమ్, రాయుడు, శివ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్.. దోమలు

ఫాగింగ్ చేయడంలో నిర్లక్ష్యం

- గుండ్లపోచంపల్లిలో స్వైరవిహారం
- అవస్థలు పడుతున్న ప్రజలు




గుండ్లపోచంపల్లిలో చెత్తతో నిండిన ఖాళీ ప్లాట్లు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. మున్సిపాలిటీలోని వార్డుల్లో రాజ్యమేలుతున్నాయి. దీంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. సాయంత్రం 6 గంటల దాటితే ఆరుబయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

అధ్వానంగా పారిశుద్ధ్యం..

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మైసమ్మగూడ, బాసిరేగడి, మునీరాబాద్, గౌడవెళ్లిలో దోమలు విపరీతంగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, మున్సిపల్ పరిధిలో సరిగ్గా ఫాగింగ్ చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే మున్సిపల్ పరిధిలోని ఖాళీ ప్లాట్లలో, ఖాళీ ప్రదేశాల్లో, రోడ్డు పక్కన ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం, పేరుకుపోయిన చెత్త కారణంగా దోమలు స్వైరవిహారం పెరిగింది. చెత్తను తొలగించడంలో మున్సిపల్ సిబ్బంది, అధికారులు అలసత్వం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఫాగింగ్ చేయడం లేదు



గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా ఫాగింగ్ చేయడం లేదు. దీంతో విపరీతంగా దోమలు పెరిగిపోతున్నాయి. సాయంత్రం 6 దాటితే ఇంట్లో తలుపులు పెట్టుకొని కూర్చోవాల్సి వస్తోంది. దోమల నియంత్రణకు మిషన్లు, దోమల బ్యాట్‌లను వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– నవీన్‌కుమార్, గుండ్లపోచంపల్లి

ప్రత్యేక చర్యలు చేపడతాం..

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపడతాం. నిత్యం ఫాగింగ్ చేసేలా సిబ్బందిని ఆదేశిస్తా. ఖాళీ స్థలాల్లో చెత్తను తొలగించి, వాటిలో చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. దోమల బెడద లేకుండా చూస్తాం.

– స్వామి, కమిషనర్, గుండ్లపోచంపల్లి

రాష్ట్రంలో సైనిక్‌స్కూల్ ఏర్పాటు చేయాలని..

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి



ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇస్తున్న క్రాంతి కీన్ ఫౌండేషన్ ప్రతినిధులు

కీసర: తెలంగాణ సైనిక్ స్కూల్స్ కోసం దమ్మాయిగూడలోని క్రాంతి కీన్ ఫౌండేషన్ బృందం, పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి గురువారం ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ కల్యాణి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని సైనిక్ స్కూల్స్‌లో కొద్ది రోజుల క్రితం తెలంగాణ విద్యార్థులు లోకల్‌గా భావించబడ్డారని, కానీ 2025లో పరీక్ష రాసిన 20 వేలమంది విద్యార్థులను ఫలితాలు వచ్చే ముందే నాన్-లోకల్ అనడం బాధాకరమని తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర అధికారులకు తెలియజేశామన్నారు. తెలంగాణ రాష్ట్రానికి సైనిక్ స్కూల్స్ స్థాపించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈటల రాష్ట్ర చీఫ్ సెక్రటరీకి లేఖరాసి మెయిల్ చేశారని వివరించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్.మనోహర్‌రెడ్డి, నాయకులు బుద్ది శ్రీనివాస్, బాపిరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిగురిస్తున్న ఆశలు !

ఫలించిన అటవీశాఖ అధికారుల ట్రాన్స్ లొకేషన్ చర్యలు

కీసర: నాగారం-రాంపల్లి, దమ్మాయిగూడ- రాంపల్లి చౌరస్తా రహదారుల విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపుల తొలగించిన రాగి, మర్రి తదితర చెట్లను వందల సంఖ్యలో కీసరగుట్ట అటవీ ప్రాంతానికి తరలించారు. వాటిని తిరిగి నాటే కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. కీసరగుట్ట వై జంక్షన్ ఏరియాతో పాటు, కీసరగుట్ట జాతర జరిగే కీసరవాణి సమీపంలోని అటవీ ప్రాంతాల్లో చెట్లను తిరిగి నాటారు. కాగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు గతంలో నాటిన చెట్లన్నీ చిగురిస్తున్నాయి. అటవీశాఖ అధికారుల కృషిని ప్రకృతి ప్రేమికులు సైతం అభినందిస్తున్నారు. నాటిన ప్రతి చెట్టు చిగురించడం సంతోషంగా ఉందన్నారు.





కీసరగుట్ట అటవీ ప్రాంతంలో చిగురించిన చెట్లు

ముగిసిన పంచాయతీల పాలన

ప్రారంభమైన మున్సిపల్ పాలన

మేడ్చల్: నియోజకవర్గంలో పాత మున్సిపాలిటీలకు తోడుగా 3 నూతన మున్సిపాలిటీలు ఏర్పాటు కావడం, వాటికి గురువారం నూతన మున్సిపల్ కమిషనర్‌లను నియమించడంతో మేడ్చల్‌లో గ్రామపంచాయతీల పాలన ముగిసి మున్సిపల్ పాలన ప్రారంభమైంది. గురువారం నూతన మున్సిపాలిటీలకు ప్రభుత్వం నూతన కమిషనర్‌లను నియమించడంతో వారు పదవీబాధ్యతలు చేపట్టారు. దీంతో నియోజకవర్గంలో 10 మున్సిపాలిటీలతో పాలన సాగుతోంది. ఎల్లంపేట్, అలియాబాద్, మూడు చింతలపల్లిలుగా 3 నూతన మున్సిపాలిటీలు ఏర్పడగా.. మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, నాగారం, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పోచారం, మున్సిపాలిటీలుగా ఉన్నాయి. ఇన్నాళ్లు అధికారికంగా కొనసాగిన మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్ గురువారంతో కనుమరుగైపోయాయి.

అటవీ సంపదను కాజేస్తున్నారు !

ఘట్‌కేసర్: కగార్ ఆపరేషన్ ముసుగులో అటవీ సంపదను కాజేస్తున్నారని, సీపీఎం సీనియర్ నాయకుడు యాదవయ్య, మండల కార్యదర్శి సబిత ఆరోపించారు. పట్టణంలోని సీపీఎం మండల కార్యలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కగార్ ఆపరేషన్‌ను నిలిపేసి పాక్ ఉగ్రవాద చర్యల నుంచి ప్రజలను కాపాడాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శామీర్‌పేట్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట పెద్దచెరువులో ఓ వ్యక్తి మృతదేహం తేలడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాల కోసం ప్రయత్నించగా.. ఆధారాలు లభించలేదు. సదరు మరణించి 4-5 రోజులై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వనమహోత్సవంలో 70 లక్షల మొక్కలు నాటాలి

అధికారుల సమావేశంలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

సాక్షి సిటీబ్యూరో: వనమహోత్సవంలో పండ్లు, ఔషధ మొక్కలను కూడా ఎక్కువగా నాటేలా చూడాలని, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీహాల్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. గ్రామీణాభివృద్ధి, అటవీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వనమహోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం ముందుగానే మొదలైనందున ఈసారి మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా ముందుగానే అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు.

◆ జిల్లాలోని మున్సిపాలిటీల్లో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని, అందుకు అవసరమైన కార్యాచరణ, ప్రణాళికాబద్ధంగా వెళ్లాలని సూచించారు. జిల్లాలో 70.604 లక్షల వరకు మొక్కలను రోడ్లకు ఇరువైపుల, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ సంస్థల్లో విరివిగా నాటి లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ మొక్కల్లో పండ్లు, ఔషధ మొక్కలతో పాటు ఈత మొక్కలను తప్పనిసరిగా 10 శాతం నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సంరక్షణ చర్యలు చేపట్టాలి..

మొక్కలను నాటడమే కాకుండా వాటికి రోజూ నీళ్లు అందించడం, ఎరువు తదితర సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలు నాటేందుకు సరిపడా స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. మొక్కలు నాటిన స్థలాలను జియో ట్యాగింగ్ ద్వారా టీజీఎఫ్ఎంఐఎస్ వెబ్‌సైట్‌లో ప్రతిరోజూ నమోదు చేయాలని ఆదేశించారు. డీఆర్డీఓ సాంబశివరావు, జిల్లా అటవీశాఖాధికారి జానకీరాం, పర్యాటకశాఖాధికారి శ్రీధర్, ఆర్అండ్‌బీఈఈ శ్రీనివాస్ మూర్తి, జిల్లా ఎస్సీ సంక్షేమశాఖాధికారి వినోద్‌కుమార్, హౌసింగ్ పీడీరమణమూర్తి, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, అటవీశాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

నూతన మున్సిపాలిటీల్లో కమిషనర్ల బాధ్యతల స్వీకరణ



చంద్రశేఖర్, అలియాబాద్



పవన్‌కుమార్, మూడుచింతలపల్లి



నిత్యానందం, ఎల్లంపేట్

శామీర్‌పేట్ : ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని అలియాబాద్, మూడుచింతలపల్లిలను నూతన మున్సిపాలిటీలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. గురువారం మండలాలకు నూతన కమిషనర్లను ప్రభుత్వం కేటాయించింది. నాగారం మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వహించిన చంద్రశేఖర్ పదోన్నతిపై అలియాబాద్‌కు విచ్చేసి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

మూడుచింతలపల్లి మున్సిపాలిటీకి...

మూడుచింతలపల్లి మున్సిపాలిటీ, నూతన కమిషనర్‌గా పవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన పవన్‌కుమార్ పదోన్నతిపై మూడు చింతలపల్లి మున్సిపాలిటీకి విచ్చేసి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఎల్లంపేట్ మున్సిపల్ కమిషనర్‌గా నిత్యానందం

మేడ్చల్‌రూరల్ : మండలంలోని 11 గ్రామపంచాయతీలను కలుపుకుని ఎల్లంపేట్ నూతన మున్సిపాలిటీగా ఆవిర్భవించింది. ఎల్లంపేట్‌ను మున్సిపాలిటీగా మారుస్తూ.. ఇదివరకే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా.. మున్సిపల్ ఏర్పాటు పనులు చకచకగా సాగడంతో మున్సిపల్ ఆవిర్భావం పూర్తైంది. ఎల్లంపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయం మున్సిపల్ కార్యాలయంగా మారింది. తొలి కమిషనర్‌గా గురువారం నిత్యానందం బాధ్యతలు చేపట్టారు.

విలీనమైన గ్రామాలు..

నూతన మున్సిపాలిటీలో మండలంలోని ఎల్లంపేట్, డబిల్‌పూర్, కోనాయిపల్లి, మైసిరెడ్డిపల్లి, శ్రీరంగవరం, బండమాదారం, సోమారం, సైదోనిగడ్డతండా, రావల్‌కోల్, రాజబొల్లారం, రాజబొల్లారం తండా గ్రామ పంచాయతీలు, అనుబంధ గ్రామాలు మున్సిపాలిటీ పరిధిలోకి రావడంతో ఇకపై మున్సిపల్ అధికారులు ఆయా గ్రామాల్లో సేవలు అందించనున్నారు. నూతన మున్సిపాలిటీ ఏర్పాటుతో మండలంలో గ్రామపంచాయతీలు కనుమరుగయ్యాయి.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాబాద్, అంకుశాపూర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్ ఎల్.సుగుణబాయి సంబంధిత అధికారులతో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తేమ, తాలు, మట్టిగడ్డలు లేకుండా నాణ్యత ఉన్న ధాన్యాన్నే రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం తేమశాతం 17 లోపు ఉన్న ధాన్యాన్నే కొనుగోలు చేస్తామన్నారు. వెదర్ ఫోర్ కాస్ట్ యాప్ ద్వారా వాతావరణ సమాచారాన్ని కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జిలు సేకరించి రైతులకు ముందస్తుగా తెలియజేయాలన్నారు. తద్వారా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుని తమ ధాన్యం తడవకుండా కాపాడుకోవడం జరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రంలో అవసరమైన టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ మీటర్లను తగిన మొత్తంలో ఏర్పాటు చేయాలని జిల్లా మార్కెటింగ్ అధికారిని ఆదేశించారు. తగినంత హమాలీలను ఏర్పాటు చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఇన్‌చార్జిలకు ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లో నేరుగా రైతు ఖాతాలో డబ్బు జమచేస్తామన్నారు.

ఎల్ఐజీలో కాలిపోయిన విద్యుత్ కేబుళ్లు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఎల్ఐజీ కాలనీ బ్లాక్‌లోకి వెళ్లే విద్యుత్ కేబుళ్లు గురువారం కాలిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సమస్యను పరిష్కరించేందుకు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు విద్యుత్‌శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. పాడైన కేబుళ్లను మార్చి కొత్త కేబుళ్లను ఏర్పాటు చేయనున్నారు.

నాలా పూడికతీత పనుల పర్యవేక్షణ



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని హనుమాన్‌పేట, జ్యోతినగర్, పలు ప్రాంతాల్లో నాలాల్లో పేరుకుపోయిన పూడికతీత పనులను గురువారం కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గౌతంనగర్‌లో నాలా పూడికతీత పనులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి రూ.27 లక్షలు నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. వ్యర్థాలతో పాటు పూడికతీతను సకాలంలో తొలగించి వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు మేకల రాముయాదవ్, అనిల్, రాములు, శ్రీను, వాసుదేవరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల పారబోతపై చర్యలేవి ?



మల్లయ్యనగర్‌కు వెళ్లే దారిలో రోడ్డు పక్కనే చెత్త

బోడుప్పల్: 23వ డివిజన్ పరిధిలోని మల్లయ్యనగర్, వాసవీనగర్ కాలనీల్లో రోడ్ల పక్కనే కాలనీవాసులు ఇష్టానుసారంగా వ్యర్థాలను పారవేస్తున్నారు. దీంతో చుట్టు పక్కల పరిసరాలు అపరిశుభ్రంగా మారడటంతో పాటు ఈగలు, దోమల బెడద పెరుగుతోంది. ముఖ్యంగా వాసవీనగర్ వీధి నంబర్- 6 రోడ్డు చివర, మల్లయ్యనగర్ కాలనీ నుంచి రా చెరువుకు వెళ్లే రహదారిలో చెత్తను వేస్తున్నారు. వారం రోజులుగా పడుతున్న తేలికపాటి వర్షాలకు చెత్త అంతా కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. శానిటేషన్ అధికారులు వెంటనే స్పందించి రోడ్డు పక్కనే చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతతున్నారు.

శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించాలి



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మల్లాపూర్: నాచారం రెడ్డి శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించాలని, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి నాచారం రెడ్డి సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పోగుల వెంకటరమణారెడ్డి, అధ్యక్షులు ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నమిలికొండ భూపాల్‌రెడ్డి, కార్యదర్శి వీరప్రతాప్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.

చినుకు పడితే చిత్తడే !

నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో మట్టిరోడ్లతో అవస్థలు



కీసర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే రహదారి

కీసర: దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీ పరిధిలోని (ఉమ్మడి కీసర మండలంలోని వివిధ గ్రామాలు) వివిధ ప్రాంతాల్లో వర్షాకాలం వచ్చిందంటే అంతర్గత కాలనీల రహదారులు చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏళ్ల తరబడి కీసర, గోధుమకుంట, అహ్మద్‌గూడ, చీర్యాల, రాంపల్లి, నాగారం, దమ్మాయిగూడ తదితర ప్రాంతాల్లో వివిధ కాలనీల్లో అంతర్గతకాలనీ రహదారులు ఇప్పటికీ బాగుపడలేదు.

◆ కీసరలోని సుభాష్‌నగర్‌కాలనీ, మసీద్‌కాలనీ, బంగారు మైసమ్మకాలనీ, వెంకటసాయి థియేటర్ కాలనీ, రామలింగేశ్వరనగర్‌కాలనీ, 198 వెంచర్ కాలనీ, నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లే రహదారి, గోధుమకుంట పరిధిలోని ఎలిఫెంట్, కృష్ణానగర్, సాయిప్రియకాలనీ, చంద్రఎన్‌క్లేవ్, పారిజాత ఎన్‌క్లేవ్, కుందన్‌పల్లిలోని రామలింగేశ్వరనగర్‌కాలనీ, టీపీఎస్ చాముండి పట్నం కాలనీ, చీర్యాలలోని డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల కాలనీ రహదారి, రాంపల్లిలోని ఆర్ఎల్, ఓయూకాలనీ, నాగారంలోని రాజ్‌సుఖ్‌నగర్ కాలనీలో కొన్నిఅంతర్గత రహదారులు, అహ్మద్‌గూడ పరిధిలోని 4వ వార్డులో కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికి మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. ఈ రహదారులు చిన్నపాటి వర్షం పడితే రోజుల తరబడి బురదమయంగా ఉన్న రహదారుల గుండా వాహనదారులు, ప్రజల రాకపోకలు సాగించాల్సి వస్తుంది. వివిధ ప్రాంతాల్లో ఉన్న మట్టిరోడ్లను సీసీరోడ్లుగా మార్చాలని ఆయా ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



కీసరలోని వివిధ కాలనీల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం పడితే చాలు కాలనీల్లో రోడ్లు బురదమయంగా మారిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు మట్టిరోడ్లు ఉన్నచోట సీసీరోడ్లు వేయాలి.

– బండారి శ్రీనివాస్‌రెడ్డి, కీసర

అధికారులు స్పందించాలి..

నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల పరిధిలోని వివిధ గ్రామాల్లో అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారులను బాగు చేసేందుకు మున్సిపల్ అధికారులు చొరవ తీసుకోవాలి. నిధులు మంజూరు చేయించాలి.

– గండి అంజయ్యగౌడ్, రాంపల్లివాసి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387